శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## గంధమహోత్సవాన్ని పర్యవేక్షించిన జాయింట్ కలెక్టర్, కమీషనర్



**నెల్లూరు కార్పొరేషన్, జూలై 31,ప్రభాతవార్త** నెల్లూరు బారా షాహీద్ రొట్టెల పండుగలో ప్రధానమైన బారాషాహీద్ గంధ మహోత్సవం ఆదివారం అర్ధరాత్రి జరిగింది. గంధ మహోత్సవానికి ఎలాంటి అవాంతరాలు కలగకుండా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్‌లు ఆధ్వర్యంలో స్వయంగా పర్యవేక్షించారు. ప్రధాన దర్గాలోపల బారాషాహీద్‌లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. సంప్రదాయ రీతిలో గంధ మహోత్సవం నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను వారు ఆదేశించారు. స్థానిక కోటమిట్టలోని అమీనియా మసీదులో మత పెద్దలు 12 బిందెలలో సంప్రదాయ బద్దంగా గంధం కలిపారు. అనంతరం పూలరథంపై ఆ బిందెలను పెట్టుకుని కోట మిట్ట, పాత జడ్పీ ఆఫీసు, నెహ్రూ బొమ్మ, కేవీఆర్ పెట్రోల్ బంకులు మీదుగా ఊరేగింపుగా బారాషాహీద్ దర్గాలోని ఈద్గాకు తీసుకొచ్చారు. అక్కడ గంధం బిందెలకు ప్రత్యేక పూజలతో పాటు బారాషాహీద్‌ల వీరత్వం, మహత్యంపై ఫకీర్లు గానం చేస్తూ సాహసకృత్యాలను ప్రదర్శించారు. సోమవారం తెల్లవారుజామున భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రధాన బిందెను గుర్రంపై పెట్టుకుని దర్గాకు చేరుకున్నారు. గంధాన్ని గడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుసేనీ ఆయన శిష్యబృందం ప్రత్యేక ప్రార్ధనలు చేసి బారా షాహీద్‌లకు ఎక్కించారు. ఆ తర్వాత గంధం ప్రసాదం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. గంధ మహోత్సవంలో జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఆర్డీఓ మలోల, నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు పాల్గొని పర్యవేక్షించారు.

## గంధమహోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించిన గుంటూరు రేంజ్ ఐజీ



**నెల్లూరుటౌన్, జూలై31,ప్రభాతవార్త** ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్నటువంటి రొట్టెల పండుగలో భాగంగా గంధమహోత్సవం సాంప్రదాయబద్దంగా, ప్రశాంతంగా ముగిసింది. ఈ మహోత్సవ భద్రత ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ పాల్‌రాజు, జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిలు స్వయంగా పర్యవేక్షించారు. పోలీసు సిబ్బంది తగు సూచనలు, సలహాలు అందించారు. అవుట్‌పోస్ట్, కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాల పనితీరు, దర్గాలోనికి ప్రవేశం, నిష్క్రమన ప్రదేశాలలో క్యూలైన్, బారికేడింగ్, ఘాట్‌లో రొట్టెల మార్పిడి ప్రదేశాలను స్వయంగా సందర్శించి భాగా ఏర్పాట్లు చేశారని ప్రత్యేకంగా ఎస్పీని, కలెక్టర్‌ను, ఇతర శాఖల అధికారులు ఐజీ అభినందించారు. ట్రాఫిక్ రద్దీ, అత్యవసర సమయాల్లో వినియోగించుకునేలా స్ట్రైకింగ్ ఫోర్స్‌ను 200మంది స్బిబందితో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సరిగా మాటలు కూడా రాని చిన్నారులు 80 మంది తప్పిపోగా అందరిని వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు. రొట్టెల పండుగలో అతి ముఖ్యమైన ఘట్టమైన గంధమహోత్సవం పోలీసు బందోబస్తు నిఘా నీడలో ఆదివారం అర్ధరాత్రి వైభవంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించారు. భక్తులు భద్రతను దృష్టిలో ఉంచుకొని గంధ ఊరేగింపు ప్రారంభం నుంచి బందోబస్తు సెక్టార్‌లు, ఊరేగింపు రూట్‌లను పూర్తి అయ్యే వరకు అనుక్షణం పర్యవేక్షిస్తూ అధికారులకు జిల్లా ఎస్పీ తగు సూచనలు చేశారు. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. భక్తజనసంద్రంగా బారాషాహీద్ దర్గా, స్వర్ణాల చెరువు భక్తజనసంద్రంగా మారింది. అట్టహాసంగా ప్రశాంతంగా జరుగుతున్న కొనసాగుతున్న ఈ పండుగ మిగిలిన రోజులు కూడాసజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

## మూడో రోజు రొట్టెల పండుగలో భక్తులకు అన్ని వసతులు కల్పించాం

**నెల్లూరు కార్పొరేషన్, జూలై31,ప్రభాతవార్త** ప్రసిద్ధి గాంచిన నెల్లూరు బారా షాహీద్ దర్గా రొట్టెల పండుగకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్ని వసతులను, సౌకర్యాలను కల్పించామని సోమవారం నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరగనున్న పండుగకు పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులకు దర్గా ప్రాంగణం, రొట్టెల మార్చుకునే స్వర్ణాల చెరువు తీర ప్రాంతంలో అన్ని వసతులను కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. స్వర్ణాల తీరంలో రొట్టెలు మార్చుకునే ప్రాంతమంతా అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. దర్గా ప్రాంగణంలో మంచినీటి కేంద్రాల ద్వారా నిరంతరం సేవలను అందించాలని, మంచినీటి కేంద్రాల సమీపంలో పరిశుభ్రతను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. బారా షాహీద్‌ల దర్శనానికి బారికేడ్ల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మంచినీటి వసతి అందించడం, వాతావరణానికి అనుకూలంగా షామియానాల ఏర్పాటు చేసి అన్ని జాగ్రత్తలు పర్యవేక్షించాలన్నారు. దర్గా లోపలి ప్రధాన ప్రాంగణాలు, దర్గాకు వచ్చే రోడ్డు వెంబడి ప్రాంతాలు, పార్కింగ్ స్థలాల వద్ద నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి కేంద్రాలకు నిరంతరం నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రొట్టెలు మార్చుకునే స్వర్ణాల తీరం వెంబడి చిన్నారులు నీళ్లలో లోతుగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా పటిష్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా మహిళా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమీషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారులు, హెల్త్ అధికారులు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బారాషాహీద్ దర్గాను పరిశీలించిన మేయర్ స్రవంతి జయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్, జూలై31,ప్రభాతవార్త** నెల్లూరు బారా షాహీద్ దర్గా రొట్టెల పండుగకు విచ్చేస్తున్న లక్షలాది మంది భక్తుల అవసరాలకు తగిన రీతిలో అన్ని ఏర్పాట్లను కార్పొరేషన్ ఆధ్వర్యంలో సిద్దం చేశామని నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ స్రవంతి జయవర్ధన్ తెలిపారు. దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగ నిర్వహణను మేయర్ సోమవారం పరిశీలించి నగరపాలక సంస్థ అందిస్తున్న సౌకర్యాలు అందుతున్నాయా లేదా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ ప్రసిద్ధిగాంచిన నెల్లూరు బారా షాహీద్ దర్గా రొట్టెల పండుగకు విచ్చేసిన భక్తులకు దర్గా ప్రాంగణం, రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు తీర ప్రాంతంలో అన్ని వసతులను నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. బారా షాహీద్‌ల దర్శనానికి బారికేడ్లు, క్యూలన్లలో ఉన్న భక్తులకు మంచినీటి వసతి అందించడం, వాతావరణానికి అనుకూలంగా షామియానాల ఏర్పాటు, క్యూలైన్ల ప్రశాంతంగా ముందుకు సాగేలా పోలీసుల పర్యవేక్షణ, లోపులాట జరగకుండా ప్రత్యేక నిఘా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన పారిశుధ్య నిర్వహణ పనులు, వసతుల కల్పన వంటి అంశాలను అనునిత్యం పర్యవేక్షించాలని, రొట్టెలు మార్చుకునే స్వర్ణాల తీరం వెంబడి భక్తులు నీళ్లలో లోతుగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా పటిష్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా మహిళా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని రొట్టెల పండుగ నిర్వహణను పటిష్టంగా చేపట్టాలమని మేయర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వెంట మైనార్టీ నాయకులు, నేతలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఆర్టీసీలో ప్రారిశ్రామిక వేత్తలతో సమావేశం

**నెల్లూరు, జులై31 ప్రభాతవార్త-విద్య** తమ సంస్థ ఆధీనంలోని ఖాళీ స్థలాలను బిఓటి పద్దతిలో లీజుకు ఇచ్చేందుకు గాను నేడు నగరంలోని స్థానిక ఆర్టీసీప్రధాన బస్టాండులోని కాన్ఫిరెన్స్ హాల్‌లో ఓతా స్రహిక పారి శ్రామిక వేత్తలలో సమావేశం నిర్వహించనున్నామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ పివి.శేషయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జిల్లా కాకుటూరులోని సంస్థ స్టాఫ్‌ట్రైనింగ్ కాలేజీలో 2870 చదరపు గజముల ఖాళీ స్థలాన్ని బిఓటి పద్దతిలో 33 సంవత్సరాలు టెండరుద్వారా పారిశ్రామిక వేత్తలకు ఇవ్వనున్నామన్నారు. ఈ టెండర్లపై పారిశ్రామిక వేత్తల సూచలను, సలహాలు తీసుకునేందుకు నేడు సమావేశాన్ని నిర్వహించటం జరుగతుందని, టెండరు పూర్తి వివరాలను తమ కార్యాలయంలోగానీ లేక తమ వెబ్‌సైట్‌నుండి కానీ తెలుసుకోవచ్చున్నారు.



## ఎటుచూసినా భక్తజనం



**నెల్లూరుటౌన్, జూలై 31, ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారిక పండుగ అయిన బారాషహీద్ దర్గా రొట్టెల పండుగను అన్ని మతాల, కులాల, వర్గాల వారు మతసామరస్యానికి ప్రతీకగా భక్తులు తమ కోర్కెలు తీర్చుకునేందుకు రొట్టెలు పట్టుకుంటుండగా కోరికలు తీరిన వారు ఆ రొట్టెలను స్వర్ణాల చెరువులో వదులుతున్నారు. అధికారికంగా రొట్టెల పండుగ సోమవారం నాటికి మూడో రోజుకు చేరింది. దర్గా స్వర్ణాల చెరువు ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తజనమే దర్శనమిస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తులు పెద్ద సంఖ్యలో దర్గాలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి స్వర్ణాల చెరువు ఘాట్‌లో రొట్టెలు మార్చుకుంటున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్గా ప్రాంతాల్లో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ 24 గంటలు విధులు నిర్వర్తిసఉ్తన్నారరు.

**పోలీసు శాఖ సేవలు భేష్...**
తప్పిపోయిన చిన్నారులు, భక్తులను వెంటనే వారి కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగిస్తున్నారు. పారిశుధ్యం ఏర్పాట్లు నగరపాలక సంస్థ సిబ్బంది పటిష్టంగా చేపడుతున్నారు. స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ మరియు మత్స్య శాఖల సిబ్బంది నిరంతరం పరిరక్షిస్తున్నారు. రెడ్‌క్రాస్ సిబ్బంది దర్గాకు విచ్చేసిన భక్తులకు సేవలందిస్తున్నారు.



## ఎసిబి వలలో దేపూరు విఆర్ఒ



**ఆత్మకూరు, జులై 31ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం దేపూరు గ్రామ రెవెన్యూ అధికారి మాల్యాద్రి రావిళ్ళ వెంకటేశ్వర్లు వద్ద 10వేల రూపాయలు లంచం తీసుకుంటూ సోమవారం ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. బాధిత వ్యక్తి, ఎసిబి వర్గాల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దేపూరుకు చెందిన రావిళ్ళ వెంకటేశ్వర్లు తన కుమారుడి పుట్టినతేది సర్టిఫికేట్ కోసం విఆర్ఓ మాల్యాద్రిని సంప్రదించాడు. ఇందుకు 17వేల రూపాయలు లంచంగా ఇవ్వాలని బాధితుడిని మాల్యాద్రి డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో తన ఆర్ధికపరిస్థితి బాగా లేదని 5వేల రూపాయలు ఇవ్వగలనని కొంత కాలంగా మాల్యాద్రి చుట్టూ తిరిగి బ్రతిమలాడినా కనికరించలేదని బాధితుడు వెంకటేశ్వర్లు విలేకర్లకు తెలిపాడు. దీంతో విసిగి వేసారిన తాను ఎసిబి అధికారులను సంప్రదించి వారి ద్వారా పథకం రచించామన్నారు. అనంతరం విఆర్ఒతో తమ పని పూర్తికావడానికి 10వేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా సోమవారం ఎల్ఆర్‌పల్లి సమీపంలోని తాను 10వేల రూపాయలను విఆర్ఒ మాల్యాద్రికి అందజేస్తుండగా ముందస్తు సమాచారంతో మకాం వేసిన ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్ గా పట్టుకున్నారన్నారు. అనంతరం విఆర్ఒను స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు విచారణ జరిపి అతని వద్దనుంచి 10వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సమాచారం. ఎసిబి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయరెడ్డి సారధ్యంలోని అధికారుల బృందం ఈ దాడిలో పాల్గొన్నారు. ఆత్మకూరు లో విఆర్ఒ ఎసిబి అధికారులు పట్టుబడిన విషయం దావానాలంగా వ్యాపించింది.

## డిసిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆర్‌డిఓ



**మర్రిపాడు, జులై 31ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం డిసిపల్లి సచివాలయాన్ని ఆత్మకూరు ఆర్‌డిఓ ఎం.కరుణకుమారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె సచివాలయ సిబ్బంది , వాలంటీర్ల హాజరును పరిశీలించారు. సచివాలయ రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సచివాలయ రికార్డుల నిర్వహణా తీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ భవనానికి సమీపంలో పోలీసు శాఖకు చెందిన విలువైన స్థలం వృథాగా ఉందని ఈ స్థలాన్ని గ్రామఅవసరాలకు , ప్రాధమిక పాఠశాల ఆటస్థలానికి వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని గ్రామస్తులు ఆర్‌డిఓ ను కోరారు. స్పందించిన ఆమె ప్రతిపాదనలు పోలీసు శాఖకు పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌ఐ సురేంద్రను ఆదేశించారు . అంతకుముందు ఆర్‌డిఓ నెల్లూరు-ముంబాయి ప్రధాన రహదారిలోని టోల్‌గేట్ సమీపంలోని సర్వే 196లోని పొలాన్ని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు సంబంధించిన ప్రక్రియను పరిశీలించారు.

## వరదలపై అప్రమత్తంగా ఉండండి



**అనంతసాగరం, జులై 31ప్రభాతవార్త:** రాబోయే వర్షాకాలంలో మరింత వరదలు వచ్చే ప్రమాదం ఉన్నందున సోమశిల జలాశయం అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సోమశిల జలాశయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా జలాశయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బొమ్మిరెడ్డి దశరధరామిరెడ్డి ఎమ్మెల్యే కి నీటి నిల్వల గురించి, నీటి లభ్యత గురించి వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ రెండవ పంటకు నాన్‌డెల్టా పరిధిలోని ఉత్తరకాలువ రైతులకు సాగునీరు విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. భవిష్యత్తులో మరింత వరద వచ్చినా ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని, ఆప్రాన్ వద్ద జరిగిన పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. క్రస్ట్‌గేట్లు రబ్బర్‌సీళ్ళు సంబంధించిన నిర్వహణ ప్రక్రియను ఎప్పటికప్పుడు నిర్వహణ చేయాలన్నారు. రాబోయే వర్షాకాలంలో గత ఏడాదికంటే మరింత ప్రవాహం వచ్చినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈసందర్భంగా ఇఇ జలాశయం క్రస్ట్‌గేట్ల వద్ద కుడి దక్షిణ గోడ ఎత్తుపెంపు కార్యక్రమం జరుగుతుందని ఇందుకు సంబంధించిన డిజైన్ సిద్ధం చేశామన్నారు.

## దేశానికే ఆదర్శం వాలంటరీ వ్యవస్థ

**పొదలకూరు జులై 31 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన వాలింటరీ వ్యవస్ద 29 రాష్ట్రాలకు ఆదర్శ వంతంగా నిలిచిందని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కున్నారు. పొదలకూరు మండలం బత్తలపల్లి,నేదురుమల్లి గ్రామాలలో సోమవారం అనేక అభివృద్ధి పనులకు ఆయన ప్రారోంభత్సవం చేశారు.సచివాలయ భవనం రైతు భరోసా కేంద్రం,సిమెంట్‌రోడ్లకు ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు వాలింటరీ వ్యవస్ద ద్వారా ఎందరో నిరుపేదలకు వెనుకబడిన వర్గాల వారికి ప్రభుత్వం సాయం రూపంలో సంక్షేమపథకాలు అందుతున్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాలలో వాలంటరీ వ్యవస్ద లేకపోవడంతో



క్షేత్రస్థాయిలో పలు పథకాలు అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. సర్వేపల్లి నియోజకవకర్గంలో సోమిరెడ్డి చేపట్టిన అభివృద్ధి పనుల కంటే తాను తక్కువ చేసినట్లు నిరూపిస్తే 2024 ఎన్నికలలో పోటి చేయనని ఇందుకు సోమిరెడ్డి సిద్ధమా అని సవాల్ విసిరారు. సర్వేపల్లి నియోజకర్గంలో ఆయన పాలించిన 15 సంవత్సరాలలో ఎంతో అభివృద్ధి జరిగిందో తాను నాలుగు సంవత్సరాల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాను . లెక్కించుకుందాం రమ్మని సోమిరెడ్డి ఇందుకు సిద్ధమైతే 2024లో తాను పోటి చేయకపోతే ఏకగ్రీవం కూడా అయ్యే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో తహసిల్దారు వీర వసంత్‌కుమార్, ఎంపిడిఒ నగేష్‌కుమారి, వివిధ శాఖల అదికారులు, వైకాపా నాయకులు, తదితరులు పాల్గోన్నారు.

## డిజిటల్ టెక్నాలజీపై విద్యార్థుల్లో అవగాహన



**కోవూరు జూలై 31 ప్రభాతవార్త :** సమాజంలో వస్తున్న నూతన మార్పులపై ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డిజిటల్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయగా.. ప్రతి పాఠశాలలో 60 ఇంచెలు టీవీతో పాటు ఒక్కొక్క పాఠశాలకు 12 ఎఫ్‌పీలను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. విద్యార్థులకు దృశ్యంబోధన ద్వారా పాంత్యాంశాలను అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించారు. త్వరలో ఈ టెక్నాలజీని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కోవూరు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో టీవీలు, ఎఫ్‌పీలను బిగించే ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించి ఇది వరకే మండలంలోని ప్రతి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కూడా రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఈ డిజిటల్ టెక్నాలజీపై అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ దృశ్య బోధన ద్వారా విద్యార్థులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని, వాటిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పంట కాలువ పూడికతీత పనులు చేపట్టాలి



**కోవూరు జూలై 31 ప్రభాతవార్త :** కోవూరు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రఘురామయ్య ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి సుస్మితారెడ్డికి పంటకాలువ పూడికతీత పనులపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు పంచాయతీ పరిదిలోని కోనమ్మతోటలోని ఇరిగేషన్ శాఖకు సంబంధించి పంట కాలువ, వేగూరు కాలువకు అనుసందానంగా ఉందన్నారు. ఆ పంటకాలువకు పూడికతీత పనులు చేపట్టకపోవడం వలన మురికినీరు నిలిచిపోయి దుర్గంధంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతూన్నరన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమల బెడద ఈ మురికి నీటి కారణంగా ఎక్కువగా ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కాలువకు సత్వరమే పూడికతీసి ప్రజలు అనారోగ్యపాలు కాకుండా కాపాడాలని ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నగేష్, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## కులాల గందరగోళాల నడుమ సర్వసభ్య సమావేశం




**వింజమూరు, జులై31ప్రభాతవార్త:** వింజమూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కులాల గందరగోళం నెలకొంది. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపిపి ఇనగనూరి మోహన్‌రెడ్డి అనారోగ్య కారణాలతో గైర్హాజరయ్యారు. అయితే ఇప్పటికే సుమారు ఏడాదిగా సమావేశాలు వాయిదా పడుతుండడంతో సమావేశాన్ని నిర్వహించాలనే తలంపుతో ఎంపిడిఒ మెజార్టీ ఎంపిటిసిల అనుమతితో మండల ఉపాధ్యక్షురాలు-2 బసిరెడ్డి సుమలతను ఎన్నుకున్నారు. దీంతో అధ్యక్షత స్థానంలో సుమలత ఆశీనులయ్యారు. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న మండల ఉపాధ్యక్షుడు-1 ఆనంగి రమణయ్య తాను ఉండగా రెండవ ఉపాధ్యక్షురాలిని అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టడం ఏమిటంటూ నిలదీశారు. కేవలం తాను బిసి సామాజికవర్గం అయినందున చిన్నచూపు చూశారని మండిపడ్డారు. దాంతో సమావేశంలో వాదోపవాదాలు జరుగుతున్న సమయంలో జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి జోక్యం చేసుకొని ఆనంగి రమణయ్యకు సర్దిచెప్పి తనను కూడా అధ్యక్షస్థానంలో కూర్చోవాలని సూచించడంతో వివాదం సద్దుమణిగింది. మండలంలో దాదాపు 60లక్షల రూపాయల మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధిపనులు చేపట్టేందుకు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ రాజేష్‌బాబు, ఎంఇఒ మధుసూధన్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావ్, వింజమూరు సర్పంచ్ నల్లగొండ్ల సృజన, ఊటుకూరు సర్పంచ్ రొడ్డా వెంగమ్మ, కాటేపల్లి సర్పంచ్ ముప్పూరి విజయలక్ష్మి, జనార్ధనపురం సర్పంచ్ రమణయ్య, ఎంపిటిసి సభ్యులు పల్లాల కొండారెడ్డి, దేగా వంశీ, పల్లా పురుషోత్తం, వనిపెంట హైమావతి, సాదం మౌనిక, యాకసిరి భవాని, ఉంటా రత్నమ్మ, కాటం ప్రసన్న , ఇరిగేషన్ ఎఇ వైష్ణవి , పంచాయతీరాజ్ ఎఇ తిరుమలయ్య, వ్యవసాయశాఖ ఎఇ శివనాగప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వరప్రసాద్, ఆర్‌అండ్‌బి ఎఇ ఫయాజ్, హెల్త్ ఎడ్యుకేటర్ బీబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

## లోకా యాప్‌లో పారదర్శకంగా వివరాల నమోదు



**కోవూరు జూలై 31 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన పొదుపు గ్రూపుల వివరాలను లోకా యాప్‌లో పారదర్శకంగా నమోదు చేసే కార్యక్రమాన్ని సోమవారం సంఘమిత్ర కార్యాలయంలో ఎల్‌సీసీలు సునీల్, హరిలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఎం వెంకటస్వామి మాట్లాడుతూ ఇప్పటిదాకా మండలానికి సంబంధించి 300 గ్రూపులను లోకా యాప్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. మిగిలిన గ్రూపుల వివరాలు కూడా పారదర్శకంగా యుద్ధప్రాతిపదికన నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పొదుపు గ్రూపుల్లో సభ్యులు మారాలన్నా.. తీసివేయాలన్నా సంబంధిత సీసీ సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. అదేవిధంగా పొదుపు గ్రూపులు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకునే సమయంలో ఎవరికి కూడా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ ఎవరైనా డబ్బులు అడిగితే ఆయన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు సుగుణమ్మ, కార్యదర్శి ధనమ్మ, సీసీలు రాజశేఖర్, శౌరీ, వసంత తదితరులు ఉన్నారు.

## రోప్‌స్కిప్పింగ్‌లో బాలికోన్నతపాఠశాల విద్యార్థుల ప్రతిభ



**వింజమూరు, జులై31ప్రభాతవార్త:** వింజమూరులోని బాలికోన్నత పాఠశాల విద్యార్థినిలు రోప్‌స్కిప్పింగ్‌లో అద్భుత ఫలితాలను కనపరచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించారు. కర్నూలు జిల్లా గార్గేయపురంలో ఈనెల 29,30తేదీల్లో అండర్-14 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన జె.వి.హర్షిణి స్వర్ణపతకం, బి.భవ్యశ్రీ రజతపతకం, సి.హెచ్.తనూశ్రీ కాంస్యపతకం సాధించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు సీతారామయ్య ప్రతిభకనపరచిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయిని రజనీ విలాస్‌లను అభినందించారు.

## బిసి నాయకుడినని అవమానం



**వింజమూరు, జులై31ప్రభాతవార్త:** వింజమూరు మండల సర్వసభ్య సమావేశం వేదికగా బిసి నాయకుడిననే కారణంతో సభాధ్యక్షస్థానంలో తాను 1వ ఉపాధ్యక్షుడిగా ఉన్నప్పటికీ 2వ ఉపాధ్యక్షుడిని పిలవడం కేవలం తాను వెనుకబడిన కులానికి చెందినవాడిననే ఉద్దేశంతోనే ఈపరిస్థితి ఏర్పడిందని మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం జరిగిన సమావేశంలో ఎంపిపి గైర్హాజరు కావడంతో 1వ ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆనంగిరమణయ్యతో సమావేశం నిర్వహిస్తారన్న సమయంలో మెజార్టీ సభ్యులు 2వ ఉపాధ్యక్షురాలు బసిరెడ్డి సుమలతకు మద్ధతు తెలపడంతో సమావేశంలోని ఆనంగి ఈ సభలో ఎస్సీ,ఎస్టీ, బిసి , మైనార్టీ సభ్యులున్నప్పటికీ ఈ పరిణామాన్ని చూస్తూ ఉన్నారే తప్ప ఏమి మాట్లాడలేదని తోటి సభ్యులను నిలదీశారు. ఉపాధ్యక్షుడిగా ఉన్న తనకు గౌరవం లేదంటే నాకు ఈ పదవి ఎందుకంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమావేశం ముగిసిన తర్వాత ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వింజమూరు మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్‌గా, బిసి నాయకుడిగా నియోజకవర్గ స్థాయిలో పేరున్నప్పటికీ సర్వసభ్య సమావేశంలో ప్రస్తుతం తనకు వ్యతిరేకంగా వ్యవహరించిన సభ్యులు వారి ఇష్టానుసారంగా అభివృద్ధి పనుల విషయంలో ఏకఛత్రాధిపత్యం చేయాలని చూస్తే తాను వ్యతిరేకిస్తానన్న నెపంతోనే తనను సభలో అవమాన పరిచారన్నారు. 60లక్షల రూపాయలతో అభివృద్ధికి కృషి చేస్తామని డంబాలుపలుకుతున్న ప్రజా ప్రతినిధులు , అధికారులు సుమారు 25లక్షల రూపాయల నిధులను ఒకే ఇంటిపేరు ఉన్న చోటుకు సిసి రోడ్లకు ఎలా ఆమోదం తెలుపుతారని ప్రశ్నించారు. తాను ఈ ప్రతిపాదనలను సమావేశంలో అధ్యక్ష స్థానంలో ఉంటే వ్యతిరేకిస్తాననే ఉద్దేశంతో ఈ పరిస్థితి తెచ్చారని కన్నీటిపర్యంతమయ్యారు. మండలంలోని అన్ని ప్రాంతా ల అభివృద్ధి జరగాలనే తన తాపత్రయాన్ని అడ్డుకుంటున్నారన్నారు. కాగా మండల ఉపాధ్యక్షురాలు బసిరెడ్డి సుమలత , మెజారీ ్ట సభ్యులు మాట్లాడుతూ ఆనంగి రమణయ్య మాటకు ముందు కుల ప్రస్థాపన తెస్తున్నాడని ఇది ఏమాత్రం భావ్యం కాదన్నారు. తామందరం మండల బాడీ ఎన్నికల సమయంలో మండల ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంగతి ఆనంగి మరువడం బాధాకరమన్నారు. అంతేకాకుండా మండల 2వ ఉపాధ్యక్షురాలి ఎన్నికల సమయంలో శంఖవరం ఎంపిటిసి సభ్యురాలు సుమలత పేరును ప్రతిపాదిస్తే ఆనంగి వ్యతిరేకించిన విషయం మరవడం దారుణమన్నారు. సమావేశంలో కులాల ప్రస్తావన ఎక్కడా తేలేదని కుల ప్రస్తావన తెచ్చి సింపతి తెచ్చుకోవాలని ఆనంగి చూడడం తగదన్నారు.

## బడి బయట పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి




**కోవూరు జూలై 31 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని 16 సచివాలయాల పరిధిలో బడి ఈడు కలిగి బడి బయట ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి మూడు రోజుల లోగా వారందరినీ బడిలో చేర్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులు, ఐసీడీఎస్ , వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వలంటీర్లు చేసిన సర్వే ప్రకారం 1788 మంది బడి ఈడు కలిగి బడి బయట ఉన్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు ఈ మూడు రోజుల పాటు 5 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వయస్సు వరకు ప్రతి విద్యార్థి బడిలోనే ఉండాలన్నారు. ఈ మూడు రోజుల పాటు ప్రతి ఒక్కరూ వారి వారి సచివాలయాల పరిధిలో వలంటీర్ల యాప్ ద్వారా వివరాలు సేకరించి పిల్లలు బడి బయట ఉన్నారా.. లే వేరే ఊరికి పర్మినెంట్‌గా బదిలీ అయ్యారా.. లేక ఎక్కడైనా ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారా అనే విషయాలను నిశితంగా సేకరించాలన్నారు. అదేవిధంగా ఆయా పాఠశాలల్లో గత సంవత్సరం ఎంతమంది చదివారు.. ప్రస్తుతం ఎంతమంది ఉన్నారో అనే వివరాలను సేకరించాలన్నారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలో అమ్మఒడి రాని వారి వివరాలను నమోదు చేసి వారికి ఏయే కారణాల మూలంగా రాలేదో నిశితంగా ఒక నివేదిక రూపంలో తయారు చేయాలన్నారు. ప్రస్తుతం చేపట్టే ఈ పనులను బాధ్యతగా, పారదర్శకంగా చేపట్టాలని, నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, ఎంఈవోలు రహీమ్, వై. చెంచులక్ష్మమ్మ, ఈవోపీఆర్డీ ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

## ఈ క్రాప్ నమోదు మరింత వేగవంతం చేయాలి



**కోవూరు జూలై 31 ప్రభాతవార్త :** కోవూరు వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ క్రాప్ నమోదు మరింత వేగవంతం చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకురాలు సుజాత అన్నారు. కోవూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన మండల వ్యవసాయాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ సీజన్‌కు సంబంధించి 45240 ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారన్నారు. సోమవారం నాటికి 11000 ఎకరాలు మాత్రమే ఈ క్రాప్ నమోదు చేయడం జరిగిందని, మిగిలినవి కూడా పారదర్శకంగా నమోదు చేసేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. వ్యవసాయం సాగు చేసే రైతులు కూడా ఈ క్రాప్ నమోదుపై అవగాహన పెంచుకుని వ్యవసాయ సహాయకులకు ఈ క్రాప్ నమోదుకు సహకరించాలన్నారు. అనంతరం మండలాల వారీగా వ్యవసాయాధికారుల పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఐదు మండలాల వ్యవసాయాధికారులు ఇందిరావతి, లక్ష్మి, కృష్ణయ్య, సురేంద్రరెడ్డి, శ్రీహరి, తదితరులు ఉన్నారు.

## ఉదయగిరి సెబ్ కార్యాలయంలో వాహనాల వేలం



**ఉదయగిరి జులై 31 ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిలోని సెబ్ కార్యాలయంలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహించారు. జిల్లా అధికారులు ఇఎస్ఎస్ రవికుమార్, కోవూరు సెబ్ సిఐ నరహరి, మురళీకృష్ణా ఆద్వర్యంలో ఈ వేలం పాట నిర్వహించగా ఎల్ఎంఎల్ ఫ్రీడం వాహనం ప్రభుత్వం 2 వేలు ధరగా నిర్వహించగా 3 వేల రూపాయాలకు వేలం జరిగిందని అన్నారు. మరో వాహనం హీరో ప్యాషన్ ప్రో ప్రభుత్వం ధర 14 వేలు నిర్వహించగా 31 వెయ్యికి వేలం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో రవికుమార్ మాట్లాడుతు జిల్లాలో గంజాయి అక్రమరవాణాగాని, అక్రమ మద్యం సమాచారాన్ని 14500 కాల్ సెంటర్ నెంబర్‌కి ఫోన్ చేసి తెలపాలని తెలిపారు.

## ఆగష్టు2న కమ్మవారిపాలెంలో గడప,గడపకు మనప్రభుత్వం

**జలదంకి, జులై31, ప్రభాతవార్త:** ఆగష్టు2న బుదవారం జలదంకి మండలం కమ్మవారిపాలెంలో గడప,గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆగ్రామ సర్పంచ్ తమ్మినేని సతీష్‌బాబు ఒకప్రకటనలో తెలియజేశాడు. ఈకార్యక్రమంలో ఉదయగిని నియోజకవర్త వై.సి.పి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, కావలి మాజీశాసనసభ్యుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ చేవూరి జనార్ధన్‌రెడ్డిలు పాల్గొంటారని కావున జట్.పి.టి.సి, ఎం.పి.టి.సిలుసర్పంచ్‌లు, వివిదహోదాలలోవున్న పార్టీనేతలు, అభిమానులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## ఇద్దరు డ్రాపౌట్ను గుర్తింపు బడిలో చేర్పించమని ఆదేశం



**జలదంకి, జులై31, ప్రభాతవార్త:** జలదంకి పంచాయతీ పరిధిలోని అప్పారావుగిరిజనసంఘంలో ఇద్దరు బడిమానేసిన పిల్లల్ని గుర్తించిన ఎం.ఇ.ఒ శ్రీధర్ వారిని వెంటనే బడిలో చేర్పించాలని ఆదేశించారు .సోమవారం ఆయన కాలనీలో పర్యటించారు. బడిమానేసిన పిల్లల్నిగూర్చి వాకబుచేశాడు. ఇద్దరు మద్యలో బడిమానేసి ఇళ్ళవద్దనే వుంటున్నట్టు గుర్తించాడు. వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. చిన్నారులను ఇళ్ళవద్ద వుంచితే వారిజీవితాలు అందకారమౌతాయి. వారిని బడులలో చేర్పించి విద్యాబుద్దులు నేర్పిస్తే బ్రతుకుకు బంగారు బాటలు వేసుకోవచ్చని వివరించాడు. ప్రభుత్వం ఉచిత విద్యతోపాటు అన్నివసతులు కల్పించడం వంటివి చేస్తు ప్రత్యేకశ్రద్ద కనపరుస్తున్నారని తెలియజేశాడు. పిల్లలతోకూడా మాట్లాడి చదువు ఆవస్యకతను గూర్చి కౌన్సిలింగ్ ఇచ్చి ఒప్పించాడు.. వెంటనే జలదంకి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో చేర్పించాలని సి.ఆర్.పి రవి, వాలంటీర్, ప్రాదమిక పాఠశాల టీచర్‌కు ఆదేశించాడు. దీంతో వారు భాద్యతలను నిర్వహించారు.

## మణిపూర్ కుకీలకు సంఘీభావంగా ర్యాలీ




**దుత్తలూరు, జూలై 31, ప్రభాతవార్త :** మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణహోమం ఘటనలపై సేవ్ మణిపూర్ నినాదాలతో మండల కేంద్రంలో నిరసనలు ,శాంతియుత ర్యాలీ లను పలు సంఘాలు స్వచ్ఛందంగా నిర్వహించారు. ప్రజా సంఘాలు, ముస్లీం, క్రైస్తవ సంఘాలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుండి ర్యాలీ గా బయలు దేరి దుత్తలూరు సెంటర్ వరకు సంఘీభావ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ మే నెల 3 వ తేది నుండి మణిపూర్ రాష్ట్రంలో దమనకాండ జరుగుతుం డగా ,అక్కడిప్రభుత్వం దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోకుండా ,జరుగుతున్న అరాచకాలను బయటకు తెలియకుండా అడ్డుకోవడం వెనుక ప్రభుత్వం నిర్లక్షధోరణిని తెలియజేస్తుందనీ మండిపడ్డా రు. రెండు తెగల మధ్య చిచ్చు పెట్టి సభ్య సమాజం తలదించుకునేలా కుకీ గిరిజన జాతీ ఆడ బిడ్డలపై విరుచుకుపడుతూ, నగ్నంగా ఊరేగించడం, అడ్డొచ్చిన వారిని చంపడం, ఊర్లు తగల బెడుతూ హింసకు పాల్పడుతున్నారనీ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. అలాంటి మానవ మృగాళ్ళను ఉరితీయాలన్నారు. ఈ కార్యక్రమములో క్రైస్తవ సంఘాల నేతలు బరబ్బా, జయరావు, చంద్రయ్య, అబ్రహం, వినోద్‌కుమార్, ఇశ్రాయిల్, జాన్, సంపత్‌కుమార్, జై సింగ్, ముస్లిం నాయకులు సైదుభాష, రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనను నిరసిస్తూ మహిళలు కొవ్వొత్తుల ప్రదర్శన



**కావలి, జులై 31 ప్రభాతవార్త:** కావలి పట్టణ శాంతినగర్‌లో సిపియం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మహిళలు మణిపూర్ సంఘటనను నిరసిస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపియం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. ఇటీవల మణిపూర్‌లో కుకీలపై జరుగుతున్న దాడులు తీవ్రంగా ఖండించారు. కుకీ తెగలకు చెందిన క్రిస్టియన్లు, చర్చిలపై దాడులు చేసి విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. అంతటితో ఆగక ముగ్గురు మహిళలను నగ్నంగా వీధుల్లో తిప్పుతూ ఒక మహిళపై సామూహిక అత్యాచారం చేయడం భారతదేశం తలదించుకునేలా వుందన్నారు. మణిపూర్ బిజెపి ముఖ్యమంత్రి ఈ సంఘటనపై చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. బిజెపి ప్రభుత్వం తెగల మధ్య చిచ్చుపెట్టి దుర్మార్గమైన పాత్ర పోషిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఇటీవల కాలంలో వెనుకబడిన కులాలపైన ఎక్కువుగా దాడులు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. మణిపూర్ దాడులు, అఘాత్యాలపై పోరాటాలు కొనసాగించి బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపియం పార్టీ నాయకులు పసుపులేటి తిరుపాలు, వై.కృష్ణమోహన్, బాబురావు, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికుమార్, ఆదిత్యరామ్, మహిళా నాయకులు వై.ఉష, టి.రమణమ్మ తదితరులు పాల్గొని మాట్లాడారు.

## జమీలా చేసిన ఆరోపణలు అసత్యాలు




**కావలి, జులై 31 ప్రభాతవార్త:** కావలి పట్టణం పాతవూరుకు చెందిన ఎస్.కె. జమీలా తమపై చేసిన ఆరోపణలు అసత్యాలని ఆమె సోదరులు ఎస్.కె.నవాబ్‌జాన్, మరిది హజరత్‌బాబులు తెలిపారు. కావలి పట్టణం రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇటీవల జమీలా మా పట్ల చేసిన ఆరోపణలు అసత్యాలని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ తల్లి గత 12 సంవత్సరాలుగా తమ వద్దే వుందన్నారు. జమీలాకు తోడుగా వుంటుందని ఆమె కుమార్తె ద్వారా తల్లిని పంపించడం జరిగిందని చెప్పారు. తాము ఆమె ఇంటికి వెళ్లగా తనపై దాడికి పాల్పడి డబ్బులు ఇవ్వాలని బెదిరించిందని సోదరుడు నవాబ్‌జాన్ తెలిపారు. తల్లి సంరక్ష విషయంలో తాము గౌరవప్రదంగా దగ్గరుండి చూసుకుంటున్నామని జమీలా అసత్య ప్రచారాలు చేసి పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదులు చేస్తుందని ఆరోపించారు. జమీలా ఇస్లాంపేటలో కృష్ణుడి గుడి వద్ద నివాసం వుంటుందని పోలీసులు వెళ్లి విచారించి కూడా వచ్చారన్నారు. ఆమె పనిగట్టుకొని వైసిపి నాయకులపై విమర్శలు చేస్తుందని అన్సర్, జానీలకు ఎటువంటి సంబంధం లేదని వారు చెప్పారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు

**బుచ్చి జులై 31 ప్రభాతవార్త:** బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని సెబ్ ఎస్ఐ ఎం.అంజయ్య హెచ్చరించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని రాఘవరెడ్డినగర్ కాలనీ సమీపంలో ముంబాయి రహదారిలో ఉన్న బ్రాందిషాపుపక్కన కూలిడ్రింక్‌షాపులో కొంతమంది మద్యం సేవిస్తుండగా ఆయన వారిని మందలించారు. ఈఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సి.ఐ జి.సూర్యనారాయణ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాలలోమద్యం సేవిస్తున్న వారిని హెచ్చరించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

## పేదలకు దుప్పట్లు వితరణ, అన్నదానం



**కావలి, జులై 31 ప్రభాతవార్త** కావలి పట్టణ సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుప్పట్లు వితరణ, అన్నదాన కార్యక్రమాలతో పాటు సంయుక్త సేవా సంస్థకు రెండు భోజన టేబుళ్ళు దాతలు అందజేశారు. నెల్లూరు నగర నివాసి సంయుక్త సేవా సంస్థ సభ్యుడు కె.శ్రీనివాసరావు, ఢిల్లీలో నివసిస్తున్న కె.కనకారావులు వారి తండ్రి స్వర్గీయ రాములు జ్ఞాపకార్ధంగా కావలి పట్టణ వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో నిరుపేదలకు అన్నదానం చేసి దుప్పట్లు, టవల్స్ అందజేశారు. సంస్థ కార్యాలయానికి అవసరమైన రెండు భోజన టేబుల్స్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు కె.శ్రీనివాసరావు, ఎన్.సి.లలిత దంపతులు, స్టెల్లా, సంయుక్త సేవా సంస్థ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, యం.వి.యన్.ప్రసాదరావు, యం.అజిత్‌బాబు, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. దాతల సేవలను కొనియాడారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



**బుచ్చి జులై 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్ సెంటర్‌లో లయన్స్‌క్లబ్ ఆద్వర్యంలో ప్రెసిడెంట్ పైడా రవీంద్రబాబు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు జోన్ చైర్మన్ పిఎంజిఎఫ్‌లయన్ టి.వి కిషోర్ పుట్టిన రోజు సందర్బంగా ఈకార్య క్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో టి.వి కిషోర్ దంపతులు పాల్గోని కేకున్ కట్ చేశారు.ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కమీటి బోగనధం వెంకటేశ్వర్లు,సప్తగిరి వెంకటేశ్వర్లు,తిరివీధి రాజేంద్ర,దర్శిబాలు,దర్శి నరసింహరావు,దర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గోన్నారు.

## బోగోలుపై కావలి వాసుల రియల్టర్ల కన్ను

**బిట్రగుంట, జులై 31 ప్రభాతవార్త** బోగోలు మండలంలోని కప్పరాళ్ళతిప్ప ఐదో నెంబరు జాతీయ రహదారి, తహశీల్దార్ కార్యాలయం, ఎంపిడివో కార్యాలయం, ఎఫ్‌సిఐ గోడౌన్ల వద్ద కావలికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు దృష్టి సారించారు. తహశీల్దార్ కార్యాలయం పడమర వైపున జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేయడంతో అక్కడ వున్న భూములన్ని తమ పలుకుబడితో కొనుగోలు చేసి వాటిని చదును చేసి రియల్టర్లు తమ వ్యాపారాన్ని పూర్తి స్థాయిలో విస్తరిస్తున్నారు. అయితే కొన్ని చోట్ల అనుమతులు లేకపోయినప్పటికి చదును చేస్తున్నారు. ఈ ప్రాంతంలో జువ్వలదిన్నె మినీ ఫిషింగ్ ఏర్పాటు చేస్తుండటం, అల్లూరు, దగదర్తి మండలాలలో పరిశ్రమలు నెలకోల్పుతుండటంతో రియల్టర్లు దృష్టి సారిస్తున్నారు. కొంతమంది పలుకుబడిన కల్గిన నేతలు అనుమతులు తీసుకోస్తూ విస్తరిస్తుండటంతో వీటికి అనుగుణంగా బోగోలు, విశ్వనాధరావుపేట పంచాయతీలలో కూడా ఇంటి నివేశన స్థలాలు చుక్కలంటుతున్నాయి. కావలి రూరల్ మండలం బుడమగుంట ప్రాంతంలో చేసే వ్యాపారస్తులు ప్రస్తుతం ఈ మండలంలో దృష్టి సారిస్తుండటంతో నెల్లూరు ప్రాంత రియల్టర్లు కూడా ఈ ప్రాంతానికి పరుగులు తీస్తుండటం గమనార్హం.

## మత్స్యకార ప్రాంతంలో యువతకు ఉపాధి



**బిట్రగుంట, జులై 31 ప్రభాతవార్త** బోగోలు మండలంలోని మత్స్యకార ప్రాంతాలలో మత్స్యకార యువతకు ఉపాధి కల్పించేందుకు వివిధ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కాంద్ర యువనేస్తం వ్యవస్థాపకులు కాంద్ర సతీష్‌నాయుడు చెప్పారు. మండలంలోని తాటిచెట్లపాళెం గ్రామంలో సోమవారం మత్స్యకార గ్రామ కాపులతో ఆయన సమావేశమయ్యారు. త్వరలో తాటిచెట్లపాళెం గ్రామంలో కూడా మెడికల్ నిర్వహించాని సతీష్‌నాయుడుని గ్రామ పెద్దలు కోరారు.మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తానని ఆయన వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంద్ర యువనేస్తం సభ్యులు పాల్గొన్నారు.

## పాతబిట్రగుంట ఉన్నత పాఠశాలను కార్పొరేట్ పాఠశాలగా తీర్చిదిద్దుతా



**బిట్రగుంట, జులై 31 ప్రభాతవార్త** బోగోలు మండలం పాతబిట్రగుంటలోని వంటేరు చినబాబుల్‌రెడ్డి మెమోరియల్ ఉన్నత పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన సహకారం అందిస్తానని పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ తెలిపారు. పాఠశాలలో సోమవారం ఇటీవల ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు ఆయన అందజేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయుల కోరిక మేరకు వంటశాల నిర్మించడం, ఆధునిక కంప్యూటర్లు విద్యార్థుల కోసం ఏర్పాటు, పాఠశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేయడానికి ఆయన అంగీకరించారు.ఈ పనులు నెల రోజుల్లో పూర్తి చేయిస్తానని ఉపాధ్యాయుల హర్షధ్వానాల మధ్య తెలిపారు.పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పసుపులేటి వెంకటేశ్వర్లు, పంది పెనుకొండయ్యలు పాల్గొన్నారు.

## నేడు కొండబిట్రగుంటలో పౌర్ణమి గరుడ సేవ

**బిట్రగుంట, జులై 31 ప్రభాతవార్త** బోగోలు మం డలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వ౦ స్వామి దేవస్థానంలో అధిక శ్రావణ మాస పౌర్ణమి సందర్బంగా మంగళవారం శ్రీ ప్రసన్నవెంకటే శ్వర స్వామి గరుడ సేవ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, కార్యని ర్వహణాధికారి అరవ రాధాకృష్ణలు తెలిపారు. ఈ ఉ త్సవానికి ఉభయకర్తలుగా అమరా బచ్చు ఛారిట బు ల్ ట్రస్ట్ ట్రస్టీ అయిన ప్రవాసాంధ్రులు బచ్చు కృష్ణ కుమార్ దంపతుల వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవంలో భక్తులు పాల్గొని తీర్ధప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని విజ్ఞప్తి చేశారు.

## రోప్ స్కిప్పింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన కొత్తసత్రం విద్యార్థిని



**కావలి రూరల్, జులై 31 ప్రభాతవార్త** కర్నూలు జిల్లా కార్సేయపురంలో జరిగిన రోప్ స్కిప్పింగ్ రాష్ట్ర స్థాయి పోటీలలో కావలి రూరల్ మండలం కొత్తసత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.జ్యోతి బంగారు పతకాన్ని సాధించింది. అలాగే 7వ తరగతికి చెందిన సుమతి రజత పతకం దక్కించుకుంది. అండర్ 14లో మాధవి రజత పతకాన్ని, అండర్ 12 విభాగంలో రజత పతకాన్ని సాధించడం జరిగిందని రోప్ స్కిపింగ్ శ్రీధర్ తెలియజేశారు. ఈ సందర్బంగా రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పిడి మురళి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## నారాయణపై వస్తున్న ప్రచారాలను నమ్మొద్దు

**నెల్లూరు జూలై 31, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి, నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొంగూరు నారాయణపై ఫేస్‌బుక్,వాట్సాప్‌ల్లో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మాజీమంత్రి నారాయణ మీద గత కొద్దిరోజులుగా కావాలనే వైసీపీ నేతలు, వైసీపీ సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నారాయణ నాలుగు గోడల మధ్య తలదాచుకున్నారని వస్తున్న వార్తల్లో వాస్తవాలు లేవని, ఆయన హైదరాబాదులోని పార్టీ కార్యాలయంలో సమావేశాల్లో ఉన్నారని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

## బాణాసంచా పేలుడు ఘటనలో నిందితుడు అరెస్ట్

**చేజర్ల,జులై31ప్రభాతవార్త:** చేజర్ల మండలం మాముడూరులో బాణాసంచా తయారీ లో సంభవించిన పేలుడులో ఇద్దరు మృతిచెందిన సంఘటన విధితమే. ఇందుకు సంబంధించి బాణాసంచా తయారు చేయిస్తున్న నిందితుడు జయంతులురెడ్డిని సోమవారం చేజర్ల పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. మే 27న జరిగిన సంఘటనకు సంబంధించి నిందితుడిని అరెస్ట్‌చేయడంలో ఆలస్యం కావడంతో ఎస్సీ,ఎస్టీ సంఘాలు ధర్నా చేసేందుకు సిద్ధమయ్యాయి. ఎట్టకేలకు పోలీసులు సోమవారం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

## పేదలకు గొడుగులు పంపిణీ చేసిన పద్మావతి శ్రీదేవి



**కావలి రూరల్, జులై 31 ప్రభాతవార్త** ప్రధాని నరేంద్ర మోడీ 9 సంవత్సరాల పాలనను పురస్కరించుకొని బిజెపి జిల్లా మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలు, శ్రీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు పద్మావతి శ్రీదేవి నిరుపేదలకు మోడీ బొమ్మ వున్న గొడుగులు పంపిణీ చేశారు.కావలి పట్టణం 7వ వార్డు 41వ బూత్‌లోని తన నివాసంలో మన్‌కిబాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని నిరుపేదలతో కలిసి ఆమె వీక్షించారు. అనంతరం తన శ్రీ సేవా సమితి తరపున నిరుపేదలకు గొడుగులు అందజేసి మాట్లాడారు. ఎండకు,వానకు ఉపయోగపడేలా మోడీ బొమ్మ వున్న గొడుగులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పదవి వున్న లేకపోయినా తన పొలంలో వచ్చిన ఆదాయంతో, ఇంటి అద్దెలతో గత 23 సంవత్సరాలుగా కావలి ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. ప్రతి కార్యక్రమం తన సొంత నిధులతో చేసానని తెలిపారు. నా సేవలను గుర్తించి కలెక్టర్ ఉత్తమ సేవ అవార్డు కూడా అందజేసారని తెలిపారు. బిజెపి అధిష్టానం తనను గుర్తించి ఉన్నత బాధ్యతలు అప్పగించిందన్నారు. పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేస్తానని తెలిపారు.

## బారాషహీద్ దర్గాలో పూజలు నిర్వహించిన టీడీపీ నేతలు



**నెల్లూరుటౌన్, జూలై 31, ప్రభాతవార్త:** నెల్లూరు నగరం దర్గామిట్టలో వెలసియున్న బారాషహీద్ దర్గా స్వర్ణాల చెరువు ఘాట్‌లో జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా దర్గాలో తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావాలని నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు కలుగుతుందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తదితరులు సోమవారం ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాటి వెంకటేశ్వర్లు, చెముకుల కృష్ణ చైతన్య, సయ్యద్ సమీ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ దిష్టిబొమ్మ దహనం



**నెల్లూరు జూలై 31, ప్రభాతవార్త-వైద్యం** బీసీ సామాజికవర్గాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా తెలుగుదేశం పార్టీ బీసీఎల్ జిల్లా అధ్యక్షుడు కప్పిర శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ సామాజికవర్గాల్లో ఉన్న పేదలు కుటుంబాలు జగన్, వారి మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న దాడులకు తట్టుకోలేక వారి కుటుంబాలు ఛిన్నాభిన్నమైపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చెంచుకిషోర్, బీసీసెల్ నగర అధ్యక్షుడు బాబుగౌడ్, నగర కార్యదర్శి విష్ణు రూరల్ నియోజకవర్గ కార్యదర్శి సుబ్బారాయుడు, బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోనాల పండుగలో పాల్గొన్న గిరిధర్‌రెడ్డి




**నెల్లూరు జూలై 31, ప్రభాతవార్త-వైద్యం** నె ల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పడారుపల్లిలో గంగమ్మ తల్లి బోనాలు పండుగలో సోమవారం టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆలయ అర్చకులు గిరిధర్‌రెడ్డికి పూ ర్ణకుంభం, వేదమంత్రోచ్ఛ రణతో స్వాగతం పలికారు.అనంతరం ఆయనకు శాలువాకప్పి ,పూలమాల వేసి సన్మానించారు. మొదట గంగమ్మ సన్నిధిలో ఆయన ప్రత్యేక పూ జలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ యనతోపాటు స్థానిక నాయకులు మేకల మధు, నన్నం శ్రీనివాసులు, చిన్న మల్లిఖార్జున, వెంకటేశ్వర్లు, మహేష్, బాబుజీ, రమణ య్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి ,కార్మికులకు వస్త్రాలు బహుకరణ




**బుచ్చి జులై 31 ప్రభాతవార్త** జొన్నవాడ దేవస్దానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు,ఆయన సతీమణి 13 వవార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ ఆయన కుమారుడు పుట్టా ప్రదీప్ ఆద్వర్యంలో వారి స్వగృహంనందు బుచ్చినగర పంచాయితీ మున్సిఫల్ సిబ్బందికి కార్మికులకు వస్త్రాలు బహుకరించారు.ఈ సందర్బంగా కార్మికులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

## బివి సుబ్బయ్యను అభినందించిన అమరేంద్రరెడ్డి



**నెల్లూరు జూలై 31, ప్రభాతవార్త-వైద్యం** డాక్టర్ బివి సుబ్బయ్య డిపిఎంఒలో పిహెచ్‌డి సాధించి డాక్టరేట్‌ను అందుకున్న సందర్భంలో ఆయనను జిల్లా లెప్రసీ కార్యాలయంలో జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ అమరేందర్‌రెడ్డి, న్యూక్లీస్ మెడికల్ అధికారి డాక్టర్ సీహెచ్ సురేంద్రబాబు, టీహెచ్ వార్డు మెడికల్ అధికారి డాక్టర్‌సునీత,ఫిజియోథెరపిస్ట్ డిపిఎంఒలు, ఏపిఎంఒలు, డిఫిట్ కోఆర్డినేటర్ సతీష్‌లు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లు కుటుంబానికి వైఎస్ఆర్ భీమా



**బుచ్చి జులై 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన కంట వెంకటేశ్వర్లు కుటుంబానికి వైఎస్ఆర్ భీమా లక్షరూపా యాలు మంజూరు కావడం జరిగింది. ముందస్తు మట్టి ఖర్చులకు పదివేల రూపాయాలు గ్రామ సర్పంచ్ లఘంతోటి బాగ్యలక్ష్మీ,వైసిపి నాయకులు మస్తానయ్య,సచివాలయం కన్వీనర్ ఆరుగుంట హరిప్రసాద్‌రెడ్డి,మాజీ ఎంపిటిసి టెంకాయల సుధాకర్, చేతుల మీదుగా కంటా ప్రభావతికి అందించారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,వాలింటర్లు పాల్గోన్నారు.

## నగర మేయర్‌కు మనోవేదనకు గురి చేయడం సమంజసమా?

**నెల్లూరుటౌన్, జూలై 31, ప్రభాతవార్త:** నెల్లూరు నగరం దర్గామిట్టలోని బా రాషహీద్ దర్గా చెరువు వద్ద జరుగుతున్న రాష్ట్ర పండుగ రొట్టెల పండుగ సందర్భంగా ప్రథమ పౌరురాలు పైగా ఒక గిరిజన మ హిళకు వీఐపీ పాస్ ఇవ్వకుండా మేయర్‌ను మనోవేదనకు గురి చేయడం బీజేపీ గిరిజన మోర్చ ఉపాధ్యక్షులు పొట్లూరు శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు. సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న యానాదాలు ప్రతి ఒక్కరూ నోటి మాటలతో సానుభూతి చూపిస్తారు. చేతలతో చూపరు అనే దానికి ఇదే నిదర్శనం. అధికా పార్టీ మేయర్‌కు ప్రథమ పౌరు రాలు అయిన స్రవంతిని కనీస మర్యాద ఇవ్వకుండా అవమానిస్తున్న అధికారులు, రాజకీయ నాయకులు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ మధ్య కాలంలో మేయర్ మంజూరు చేసిన రోడ్డు వేయవద్దని ఆపి వేయడం, అదేవిధంగా మేయర్‌ను ప్రతి విషయంలో టార్గెట్ చేయడం బీజేపీ గిరిజన మోర్చ ఉపాధ్యక్షులు పొట్లూరి శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు.

**ప్రకటన**
కావలి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 14.12.2001 తేదీన డాక్యుమెంటు నెం.3075/2001 గా రిజిష్టరు పంపకము పారీకత్తు ఈ క్రింద తెలిపిన షెడ్యూలు దాఖలా భూములు నాకు సంక్రమించినవి. 20.07.2023 తేదీన గౌరవరం నుండి ముసునూరుకు ఆటోలో పోతుండగా ఒరిజినల్ డాక్యుమెంటు పోయినది.
గౌరవరం గ్రామ సర్వే నెంబర్లు 445-3-1 య.0.05, 445-2-2 లో య.0.11, 358-2ఎ లో య.0.11, 346-2 లో య.0.04, 22 లో య.2.77, 20 లో య.2.65 & 19 లో య. 1.68 సెంట్లు వెరశి య.7.41 సెంట్లు.
దొరికినవారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.
నలుబోలు లక్ష్మి కాంతమ్మ
సెల్ 9959959945

**BUCHIREDDYPALEM NAGAR PANCHAYAT**
SPSR NELLORE DISTRICT
**e-PROCUREMENT NOTICE**
TN.NO:01/15th Commission/Q2-Q4/ENG/MAE/2022, Date:24.07.23
1) Buchireddypalem Nagara Panchayat - 15th Finance Commission Grant - Manufacture, supply and Delivery of JCB 3DX Pluse BSIv Bachoe loader fitted with 1.10 Cum Loader Buckel & 0.26 Cum Excavator
**Est. Contract value: 31.00 Lakhs**
Bid Document downloading Start Date : **28/07/2023, 11:00 AM**
Bid Document downloading End Date : **14/08/2023, 05:00 PM**
Further details can be seen at e-procurement market place in www.eprocurement.gov.in Officer inviting Bids Municipal Commissioner Buchireddypalem Nagar Panchayat. A.P
Sd/- **L.Chandra Sekhar Reddy**
Municipal Commissioner,
Buchireddypalem Nagar Panchayat

## పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలంటూ రొట్టె పట్టుకున్న మనుక్రాంత్



**నెల్లూరుటౌన్, జులై31 ప్రభాతవార్త** తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ 2024 ఎన్నికల్లో అఖండ విజయం సాధించి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ సోమవారం జనసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి ప్రత్యేక రొట్టెను పట్టుకున్నారు. రొట్టెల పండుగ సందర్భంగా ప్రఖ్యాతి గాంచిన బారాషాహిద్ దర్గాను ఆయన నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబుతో కలిసి సందర్శించి ప్రత్యేక ప్రార్థనలను చేశారు. అనంతరం స్వర్ణాల చెరువులో వారి అభీష్టం మేరకు రొట్టెను పట్టుకున్నారు. అలాగే నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు నగర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రొట్టెను పట్టుకున్నారు. ఈ సందర్భంగా మనుక్రాంత్‌చెన్నారెడ్డి మాట్లాడుతు మత సామరస్యానికి ప్రతీకగ నిలిచే రొట్టెల పండుగనాడు కోరుకున్న కోరికలు తీరుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. రా ష్ట్రంలో వైకపా అరాచక పాలన పోవాలని, ప్రజా సంక్షేమం విలసవంతమైన జీవితాన్ని విసర్జించి రాజకీయాల్లోకి నిస్వార్థంగా వచ్చిన పవన్‌కళ్యాణ్‌ను ముఖ్య మంత్రి కావాలని రొట్టె పట్టుకోవటం జరిగిందన్నారు. రానున్న ఎన్నికలు రా ష్ట్రబివృద్ధికి ఎంతో కీలకమని, అందరూ తమ అధినేతను ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయుకలు షేక్.ఆలియా, సుంద౦రరామిరెడ్డి, మున్వర్, కరీం, రేవంత్, సౌమ్య, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీరు కలుషితమవుతున్నాయి జాగ్రత్తలు తీసుకోండి



**కందుకూరు, జూలై31,ప్రభాతవార్త** సిపిఎం కందుకూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.సీజనల్ వర్షాలు కారణంగా మంచినీరు కలుషితమవుతున్నాయని,కొన్ని ప్రాంతాల్లో మంచినీటిలో తెల్లటి పరుగులు,చిలుము,వాసన వస్తుందని తెలిపారు.సమ్మర్ స్టోరేజీలో బ్లీచింగ్ అలాగే పట్టణంలో ఉన్న వాటర్ ట్యాంకులు అన్ని శుభ్రం చేయాలని పైపులైన్ దగ్గర కొన్ని చోట్ల మురుగునీరు కలవకుండా జాగ్ర త్తలు తీసుకోవాలని తెలిపారు.వర్షాల కారణంగా సైడు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుని పోయిం దని,గ్యాంగ్ వర్క్‌పెట్టి టౌన్ అంతా ఒకేసారి కా లువల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించా లి.జ్వ రాలకు కారణమవుతున్న దోమలను నిర్మూలించడం కోసం కార్యక్రమం చేపట్టాలి దోమలను నివారించడం కోసం టౌన్ అంతా అదనంగా కార్మికులను పెట్టి ఫాగింగ్ చేయించాలన్నారు.సీజనల్‌వ్యాధులు వ్యాపించకుండా ప్రభుత్వ ఆసుపత్రి ఆరోగ్య కేంద్రాలు,ఆరోగ్య కార్యకర్తలు జ్వరాల నివారణ కోసం చర్యలు చేపట్టాలని కోరారు.సబ్‌కలెక్టర్ మున్సిపల్ శానిటరీ అధికారులు వాటర్ సప్లై అధికారులు,ప్రభుత్వ ఆసుపత్రి,ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఈ సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఏ గౌస్,ఎ స్.కె మున్వర్ సుల్తానా,ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు జూలై31 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్ర మాన్ని వైభవంగా నిర్వహించారు.ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తలు ఏ. హనుమారెడ్డి, పాటూరు మోహన్, సుధాకర్, వంశీ, నాగరాజు, తదితరులు ఉన్నారు.

## 2024 ఎన్నికల్లో జనసేన జెండా ఎగురవేయాలి



**నెల్లూరుటౌన్, జులై31 ప్రభాతవార్త** 20 24 ఎన్నికల్లో రాష్ట్రంలోని అరాచక వైకా పా ప్రభుత్వాన్ని గద్దెదింపాలని, ప్రజా ప్రభుత్వమైన జనసేన జెండా ఎగుర౦వేయ్యాలని ఆకాంక్షిస్తూ సోమవారం జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గనుకుల కిషోర్ బారాషాహిద్ దర్గాలో ప్రత్యేక ప్రా ర్థలను గావించారు. అనంతరం స్వర్ణాల చెరువులో రొట్టెను పట్టుకున్నారు. అనంత౦రం దర్గాకు విచ్చేసిన భక్తులు, సందర్శలకులు, స్థానికులతో మాట్లాడి ఏర్పాట్లు, వసతులన గురి ంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు మత సామరస్యాలకు ప్రతీకగా అందరూ కలిసి జరు పుకునే రొట్టెల పండుగ, బారాషాహిద్ దర్గా నెలూరులో ఉండటం గర్వకారణమన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని, వైకాపా పాలనలో ప్రజలు అల్లాడి పోతున్నారన్నారన్నారు. శాంతి భద్రతలు పూర్తిగా నాశనమయ్యాయని ఆరోపించారు. వైకాపా నాయకులు గూండాల్లా ప్రవర్ధిస్తున్నారని, ఇటీవల ఓ వాలంటీరు తమ అధినేత పవన్‌కళ్యాణ్‌ను అవమానించారి, అందుకు నిరసనగా తాము ఆప్రాంతానికి వెళ్లుతుంటే తమను పోలీసులు అధికారులు అడ్డుకుని అక్కడకి పోకుండా నిలుపుదల చేశారన్నారు. నెల్లూరు రూరల్‌లో పెత్తం దారులు అధికారాన్ని చేత్తుల్లోకి తీసుకుని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి రౌడీ రాజకీయం పోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో తమ అధినేత పవన్‌కళ్యాణ్ అత్యధిక మెజారిటీతో గెలుపొంది విజయం సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు కోలా విజయలక్ష్మీ, రేణుక, వర్షన్, మౌనిష్, షాజహాన్, శరవణ తదితరులు పాల్గొన్నారు.

